

ఏడోఫేజ్‌లో వైన్‌షాప్ వద్ద పరిస్థితి

మద్యంప్రియుల చర్యలతో ప్రజలకు ఇబ్బందులు

కేపీహెచ్‌బీకాలనీ, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యంప్రియుల చర్యలతో జనం హడలెత్తిపోతున్నారు. ఏడోఫేజ్‌లో వైన్‌షాప్ ముందు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తూ బహిరంగంగానే మద్యం తాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌తో పాటు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ నుంచి చీకటి పడిందంటే యువతులు, మహిళలు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. రైల్వేస్టేషన్ నుంచి ఏడోఫేజ్, అంబేడ్కర్‌నగర్, కైత్లాపూర్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే వారు నడుచుకుంటూ రావచ్చు. కానీ మద్యం తాగేవారి కారణంగా పరిసర ప్రాంతాల్లో నివసించే వారు కూడా భయపడుతున్నారు. కొందరు వ్యక్తులు వైన్‌షాప్ నిర్వాహకులకు అండగా ఉండటం వల్లనే ఈ తతంగం నడుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సామాన్య ప్రజానికాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకముందే జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీలో సోనీ తదితరులు

డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

కేపీహెచ్‌బీకాలనీ, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మూసాపేట్ సర్కిల్ ఎంటమాలజీ విభాగం అధికారి బిసోనీ సూచించారు. జాతీయ డెంగ్యూ డే పురస్కరించుకొని శుక్రవారం మూసాపేట్ సర్కిల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. జనతానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బస్తీ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్లు పి.మహేందర్ రెడ్డి, పి.ఉదయ్ కుమార్, జి.యాదిలాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమకాటుకు గురికాకుండా, డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా ఉంటామని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద వైద్యులు డా. రాజ్యలక్ష్మి అన్నారు. జాతీయ డెంగ్యూ డేను పురస్కరించుకుని బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెంగ్యూ నివారణ చర్యల గురించి ప్రజలకు వివరించారు.

సమస్యలు పరిష్కరించండి

నగర కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే మాధవరం



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వరద నీటి కాలువల పనులను వర్షాకాలం లోపు పూర్తిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో కార్పొరేటర్‌లతో కలిసి కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కూకట్‌పల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. బాలానగర్, ఫతేనగర్, అల్లాపూర్, బాలాజీనగర్, కేపీహెచ్‌పీ డివిజన్‌లలో వరదనీటి కాలువల పనులు ఇప్పటి వరకు సగం పూర్తి చేశారని, నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. అలాగే ఫతేనగర్ ఆర్‌యూబీ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. అభివృద్ధి పనులకు వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయాలని కోరారు. తన నియోజకవర్గంలో అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్న భవనాలను కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేస్తున్నారని, పక్క నియోజకవర్గంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా అక్కడి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బాలానగర్‌కు చెందిన గడ్డపార విష్ణుకు రూ.2 లక్షలు, అల్లాపూర్‌కు చెందిన ఫయాజ్‌కు రూ.2 లక్షలతో పాటు నియోజకవర్గానికి చెందిన మరో పది మందికి చెక్కులు పంపిణీ చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

కూకట్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): 400 ఏళ్ల చరిత్ర ఉన్న కూకట్‌పల్లి సీతారామాలయాన్ని అభివృద్ధి చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ బండి రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆలయ నూతన కమిటీ సభ్యులకు ఆలయ అధికారులు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సభ్యులు పనిచేయాలని, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.



కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నేతలు



ప్లకార్డులతో భిక్షాటన చేస్తున్న కార్మికులతో సీఐటీయూ నాయకులు

కార్మికులకు న్యాయం చేయాలి

బాలానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రశాంత్‌నగర్‌లో ఉన్న టాడ్ ఏరోస్పేస్ కార్మికులు శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వాడలో భిక్షాటన చేస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరి నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా కార్మికులకు వేతనాలు పెంచకుండా యాజమాన్యం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా లేబర్ అధికారులు స్పందించి టాడ్ ఏరోస్పేస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

నల్లపోచమ్మ ఆలయంలో రాజేశ్వర్‌రావు పూజలు

కూకట్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత నల్లపోచమ్మ దయతో అందరూ బాగుండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డయార్‌గూడలోని నల్లపోచమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



నాలాలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా చర్యలు

ఫతేనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నాలా నీరు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఫతేనగర్ డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న నాలా పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికే జలమయమయ్యే దీన్‌దయాల్ నగర్, నాగార్జున కాలనీ, మాధవీ నగర్, అక్షయ్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



కాంతారావును సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

లక్ష్మీగణపతికి మాధవరం కాంతారావు పూజలు

బాలానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ నవజీవన్‌నగర్‌లోని విజయగణపతి ఆలయంలో నిర్వహించిన లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ, నవజీవన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాంతారావును సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. ప్రతి నెలా సంకష్ట చతుర్థినాడు లక్ష్మీగణపతిని పూజిస్తే భక్తులు కోరుకున్నవి జరుగుతాయన్నారు.

సరస్వతి పుష్కరాలకు కూకట్‌పల్లి నుంచి బస్సులు

బాలానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గురువారం నుంచి ప్రారంభమైన సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని కూకట్‌పల్లి ఆర్టీసీ డీఆర్ఎం జి.అపర్ణ కల్యాణి పేర్కొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం బస్సులను అందుబాటులో ఉంచామని, ఈ సేవలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 8919493417, 9341667738 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 16(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ బాలాజీనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ భీమలింగప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు బాలాజీ నగర్, వివేక్ నగర్, కేపీహెచ్‌బీ ఏడోఫేజ్, మూసాపేట్ ఆంజనేయనగర్.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ప్రగతినగర్, సాయిబాబా ఆలయం, వసుంధర హాస్పిటల్.. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు రాందేవ్‌రావు హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



ఏసీపీ నరేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

బాలానగర్ ఏసీపీని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

బాలానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, హెచ్ఏఎల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా13, వంకాయ18, బెండకాయ35, పచ్చి మిర్చి35, బజ్జి మిర్చి45, కాకరకాయ35, బీరకాయ 35, క్యాబేజీ13, బీన్స్85, క్యారెట్27, గోబి పువ్వు23, దొండకాయ25, చిక్కుడు 55, గోరు చిక్కుడు35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీర 18, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కంద 75, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 18, మామిడి కాయ 15-20, అరటికాయ 9-11, చామగడ్డ 31, ముల్లంగి 4-5, చిలగడదుంప 28, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 85, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

అభివృద్ధి దిశగా కుడికుంట

మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

- పదేళ్ల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు
- స్వచ్ఛంద సంస్థ సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు

గచ్చిబౌలి, మే 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా అవతరించింది. అభివృద్ధిలోనూ శరవేగంగా దూసుకుపోతుంది. అయితే ఈ ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలు మురికి కూపాలుగా మారాయి. నియోజకవర్గంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అభివృద్ధి చెందుతున్న, కొత్తగా వెలుస్తున్న కాలనీలు, బస్తీల నుంచి వెలువడే మురుగు నీటిని సమీపంలోని చెరువులు, కుంటల్లోకి నేరుగా వదులుతున్నారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధిచెంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీదు బండలోని కుడికుంటలోకి మురుగునీరు రావడంతో పూర్తిగా అధ్వానంగా తయారైంది. 10 సంవత్సరాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో సాహా అనే స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి కుడికుంటకు పూర్వవైభవం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు.


మురుగు నీటిని తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న కుడికుంట

సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నం..

కుంట పైభాగంలో ఉన్న సుమారు 20 కాలనీల నుంచి వెలువడుతున్న మురుగునీటిని కుంట కింది భాగంలో ఉన్న నాలాలోకి వదులుతున్నారు. మురుగు నీరు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. చెరువులోకి కేవలం వర్షపునీరు మాత్రమే వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కల్పన తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో కుడికుంటను పర్యాటక కేంద్రంగా తయారుచేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని ఆమె వెల్లడించారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు సహకారంతో పనులు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సైతం సహకారం అందిస్తున్నారని, మురికి కూపంగా ఉన్న కుంటను సుందరంగా తీర్చిదిద్ది ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.


చెరువులో పూడికను తొలగిస్తున్న సిబ్బంది

పర్యాటక కేంద్రంగా మారుస్తాం

మసీదుబండలోని కుడికుంటను సాహా అనే స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకుంది. సుమారు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంటను సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- నళిని, ఇరిగేషన్ అధికారి

చెరువును సుందరీకరించడం అభినందనీయం



ఇప్పుడు కుంట అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీంతో కుంటలోకి మురుగునీరు రావడం లేదు. ఉన్న నీటిని సైతం పూర్తిగా తొలగించారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి.

- జనార్దన్‌రావు, మసీదుబండ

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ఇబ్బందులు

చందానగర్, మే 16(ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్-21 పరిధిలో హుడా కాలనీ, ఆర్టీసీ కాలనీ, మియాపూర్‌లోని స్వర్ణపురి కాలనీ, మదీనగూడ సర్వీస్ రోడ్లను మంజీరా పైప్‌లైన్ నిర్మాణం కోసం ఏడాది క్రితం తవ్వారు. పైప్‌లైన్ వేసిన అనంతరం మరమ్మతులు సరిగా చేయలేదు. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


స్వర్ణపురి కాలనీలో తవ్వి వదిలేసిన గుంత

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మియాపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదిత్యనగర్‌కు చెందిన వ్యక్తికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ పండ్ అపన్నహస్తంగా నిలుస్తుందన్నారు.



పోలీస్ ఉద్యోగంలో కంటి చూపు చాలా ముఖ్యం

గచ్చిబౌలి, మే 16(ఆంధ్రజ్యోతి): కంటి ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లను పాటించాలని కొండాపూర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ సూచించారు. శుక్రవారం బెటాలియన్‌లో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగంలో కంటిచూపు చాలా ముఖ్యమన్నారు. ఈ శిబిరంలో బెటాలియన్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ రాంబాబు, ఎం.పార్థసారథి రెడ్డి, ఎం.నాగభూషణం, ఆసుపత్రి వైద్యులు జ్యోతిబాపూలే పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): కోమరంభీం విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు అంబికసూపర్‌మార్కెట్, పెద్దమ్మ టెంపుల్, బీఎస్ చౌరస్తా, వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. జేవీకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో 9.30 నుంచి 10 గంటల వరకు జేవీకాలనీ, 10.30 నుంచి 11 గంటల వరకు గచ్చిబౌలి, సెంట్రల్‌మాల్, జర్నలిస్టు కాలనీ, ఫైర్ స్టేషన్.. 3 నుంచి 3.30 గంటల వరకు శ్రీరామస్కూల్, చర్చిగ్రామం, సుముదుర అపార్ట్‌మెంట్స్.. 4 నుంచి 4.30 వరకు గౌలిదొడ్డి, అపర్ణ కేశవనగర్, జయభేరి ఫేజ్-4.. ఉదయం 9 నుంచి 11, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయి ఐశ్వర్య కాలనీ, ఖాజాగూడ, గన్‌శ్యాం, నిహారిక రెసిడెన్సీ, సాయివైభవ్ కాలనీ, అశోక్ బిల్డర్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

శాంతినగర్ ఫీడర్ పరిధిలో..

శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు శాంతినగర్, రఘుపతిరెడ్డి హౌస్, కడిమి హాస్పిటల్, హుడా కేఫ్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు సాయిబాబా ఆలయం, ఎంఎంటీఎస్ ట్రాక్‌రోడ్డులో విద్యుత్ ఉండదన్నారు.

డెంగ్యూ నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే

గచ్చిబౌలి, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి నివారణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బొర్ఖడే అన్నారు. శుక్రవారం జోనల్ కార్యాలయం ఆవరణలో డెంగ్యూ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా డెంగ్యూపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యాలయం నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జోనల్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో నీరు నిలవకుండా చుసుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

హైదర్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): భూసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం భవ్యాస్ తులసీవనంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం మూలమూర్తికి అభిషేకం, సర్వభూపాలవాహనం, స్నపన, తోమాలసేవ, కొలువు, అర్చన, ఊంజల్‌సేవ, హనుమంత వాహనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పుష్పగిరి మఠాధీశ్వరులు, జగద్గురువు విద్యాశంకర భారతిస్వామి హాజరయ్యారు.


ఉత్సవాల్లో పాల్గొన్న విద్యాశంకర భారతిస్వామి





ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086

అధినేత మెప్పు కోసమే ప్రభుత్వంపై విమర్శలు

● ఎమ్మెల్యేపై హన్మంత్‌రెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

నిజాంపేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌పై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ,గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై పాలన చేయగా, తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజ ల్లో తిరుగుతూ, రోజులో 18 గంటల పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత మెప్పు పొందడానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను హెచ్చరించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఆధారంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రావణ్‌కుమార్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించరా?

● గాజులరామారం సర్కిల్ ఆఫీసు వద్ద సీపీఐ ధర్నా



గాజులరామారం, మే 16 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. తాము ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడ లేదని మండిపడ్డారు. ఈ మేరకు సీపీఐ నాయకులు గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ, గాజులరామారం, జగద్గిరిగుట్ట డివిజన్లలో రోడ్లను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షంనీరు, డ్రైనేజీ నీరు వెళ్లేందుకు కాలువలు నిర్మించాలని రెండు నెలల క్రితం ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తున్న అధికారులు .. తమ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్ శ్రీనివాస్, సదానంద్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజులరామారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు భవానీ నగర్, చిత్తారమ్మ దేవి నగర్, జయశంకర్‌నగర్, మల్లారెడ్డినగర్, టీఎంరెడ్డి నగర్, భారత్ ఫంక్షన్‌హాల్ లైన్, పీపీ నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో..

పేట్‌బషీరాబాద్: మరమ్మతుల కారణంగా పేట్‌బషీరాబాద్ సబ్-స్టేషన్ పరిధిలోనిఈ కింది ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ ఉండదని ఏఈ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు భజరంగహిల్స్, ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు ప్రాగాటూల్స్ ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు జీబీఆర్ క్లబ్, ఫెయిర్‌మాంట్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వర్షం వచ్చిన ప్రతిసారీ ఇంతే!

● నీరు నిలిచి రాకపోకలకు అవస్థలు


రహదారిలో నిలిచిన నీరు

పేట్‌బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆలోచన, ప్రణాళిక లేకుండా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కాలనీల్లో వేస్తున్న రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జీడిమెట్ల డివిజన్ వసంత విహార్ కాలనీలోని పార్కు పక్కన ఉన్న రోడ్డు పరిస్థితే ఇందుకు ఉదాహరణ. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఈరోడ్డుపై భారీగా వరద నీరు చేరింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అధికారులు, కాంట్రాక్టర్ ఎత్తు, పల్లాలు చూడకుండా రోడ్డు వేయడం వల్ల వర్షం పడిన ప్రతిసారీ ఈ రోడ్డు వరద గోదారిని తలపిస్తోంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వాకింగ్ కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కులోకి నీరు రావడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని కాలనీ అధ్యక్షుడు దేవేందర్ అన్నారు. పార్కు వద్ద రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులతో కలిసి గతంలోనే అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


దూలపల్లికి వెళ్లే రహదారిలో నిలిచిన వర్షం నీరు

ఎక్కడ గుంత ఉందో?

● మున్సిపల్ ఆఫీస్ నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డులో ఇలా...

పేట్‌బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయం నుంచి దూలపల్లికి వెళ్లే రహదారిలో నీళ్లు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని న్యూజీవీడ్ సీడ్స్ కంపెనీ ముందు నుంచి వెళ్లే రహదారిలో రోడ్డు పొడుగునా గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు నరక యాతన పడుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్తున్న సమయంలో భారీ వాహనం వస్తే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాన్ని రోడ్డు పక్కన నిలుపుకోవాల్సిందే. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల్లో నీరు నిల్వకుండా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా

● 'డబుల్' ఇళ్లవాసులకు కూన శ్రీశైలంగౌడ్ హామీ


డబుల్ బెడ్రూమ్‌వాసులతో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

దుండిగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నివాసితుల నుంచి సొసైటీ పేరుతో కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసిందని, అది మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హెచ్చరించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన బహదూర్‌పల్లిలో డబుల్‌బెడ్ రూమ్స్ కాలనీలో పర్యటించి స్థానికులను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగు నీరు, డ్రైనేజీ సమస్యలతో పాటు సొసైటీని ఏర్పాటు చేసి కొందరు డబ్బు వసూ ళ్లు చేస్తున్నారని, అలాగే డబుల్ ఇళ్లు లబ్ధిదారుల్లో కొందరికి అధికారులు నోటీసులు ఇచ్చారని డబుల్ ఇళ్ల నివాసితులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ, నోటీసులను చూసి ఆందోళన చెందవద్దని, నోటీసులు తీసుకున్న వారంతా అధికారులకు లెటర్ ద్వారా వివరణ రాసి ఇవ్వాలని సూచించారు. సొసైటీ పేరుతో డబ్బులు వసూళ్లు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాదూయాదవ్, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, డబుల్‌బెడ్‌రూమ్ వాసులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డీసీ నర్సింహ తదితరులు

గాజులరామారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని గణేష్ నగర్‌లో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నర్సింహ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ ను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డీసీ నర్సింహ అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నెంబరు ప్లేట్ లేని 101 వాహనాలపై కేసులు


ఆటో నెంబర్‌ప్లేట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

పేట్‌బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని రహదారిపై వెళ్తున్న ఆటోలను ఆపి నెంబర్ ప్లేట్లు పరిశీలించారు. ఆటోలకు నాలుగు వైపులా నెంబర్ ప్లేట్‌లు ఉండాలని, తప్పక యూనిఫామ్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని డ్రైవర్లతో ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. నెంబర్ ప్లేట్ లేని, యూనిఫామ్ ధరించని డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా నెంబరు ప్లేట్ లేని 101 వాహనాలపై కేసులు నమోదుచేశారు. తనిఖీల్లో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ప్రవీణ్‌గౌడ్

నిజాంపేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎన్ఎంసీ బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్ అన్నారు. రాజీవ్‌గాంధీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న బోరంచ ఆనంద్ కొంత కాలంగా అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ప్రవీణ్‌గౌడ్‌ను కోరారు. దీంతో ఆయన ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆనంద్‌కు ప్రవీణ్‌గౌడ్ అందజేశారు.

CAUTION NOTICE

General Public are hereby informed that, My Client Mr.Dr. Sudhir Medisetty, S/o. Late Shri M.Venkata Swamy is the absolute owner of all that the Land admeasuring Ac. I- I8Gts (having acquired the same by virtue of operation of a will deed) and Ac.1-06Gts by virtue of a registered sale deed, total admeasuring Ac.2-24Gts situated in Survey Number 91 of Jeedimetla Village, Quthbullapur Mandal, Medchal-Malkajigiri District and had been contesting various civil proceedings before the Civil Courts situated at Medchal arid also before the Hon'b1e High Court with respect to these lands. General Public are as such cautioned not to enter into any sort of registered transactions with respect to the said lands, failing which they shall be doing the same at their own risk and cost and the said registered sale transactions shall not be binding on my client.

SAINI KESHAVA RAO, Advocate
Plot No.1, SCB No.6–R3-007, Sikh Road,
Sikh Village, Secunderabad – 500 009.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366